క్లుప్తంగా

ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం

ఎంపీ మార్గాని భరత్‌రామ్



దివ్యాంగుడితో మాట్లాడుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం వచ్చిందని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. శనివారం స్థానిక 29వ వార్డు గీతా అప్సర థియేటర్ వద్ద సోమాలమ్మ గుడి ప్రాంతంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి పర్యవేక్షణలో ఆ వార్డు ఇన్‌చార్జి బిల్డర్ చిన్న, పిల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎంపీ ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ లబ్ధిదారులను అడిగారు. అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్న సీఎం జగన్‌ను వచ్చే ఎన్నికల్లో గెలిపించాల్సిన బాధ్యత మీదేనని ఎంపీ లబ్ధిదారులకు తెలిపారు. అర్హులందరికీ ఇళ్ల పట్టాలు, ఇళ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత తనదేనని ఆయన హామీ ఇచ్చారు. చాలా వరకూ సమస్యలను అక్కడికక్కడే అధికారులకు చెప్పి పరిష్కరించారు. నాయకులు మజ్జి అప్పారావు, పీతా రామకృష్ణ, 24వ వార్డు ఇన్‌చార్జి అరవ సురేష్, చవ్వాకుల సుబ్రహ్మణ్యం, లక్కోజు ఓంకార్, కేదారిశెట్టి గోవింద్, పులగం సుధారెడ్డి, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

ప్రీతిసౌజన్యకు డాక్టరేట్ ప్రదానం



ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం నగరానికి చెందిన అప్పారి (ఇళ్ల) ప్రీతిసౌజన్యకు శ్రీసత్యసాయి టెక్నాలజీ అండ్ మెడికల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ డొమైన్‌లో 'కాగ్నిటివ్ రోబోటిక్స్ అండ్ హ్యూమన్ రోబోట్ ఇంటరాక్షన్' అనే అంశంపై అధ్యయనం చేసి పరిశోధనా గ్రంథం సమర్పించడంతో డాక్టరేట్ ప్రదానం చేసింది. సామాజిక, సాంకేతిక, వైద్య అంశాల్లో రోబోల ఉపయోగం పెరుగుతోందని, భవిష్యత్తులో టెక్నాలజీ అంతా రోబోటిక్స్‌పై ఆధారపడి ఉంటుందని, అందుకే ఈ అంశంపై పరిశోధన చేసినట్లు ఆమె వివరించారు. కాగ్నిటివ్ రోబోటిక్స్– మానవ– రోబోట్ ఇంటరాక్షన్ (హెచ్‌ఆర్‌ఐ) భవిష్యత్తులో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, సెన్సర్ పర్సెప్షన్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్‌లలో మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. భవిష్యత్తులో మానవులు, రోబోల పరస్పర సహకారం మరింత ప్రాముఖ్యత కలిగి ఉంటాయని ప్రీతిసౌజన్య వివరించారు.

యోగా శిక్షణ తరగతులు

సీటీఆర్‌ఐ: స్థానిక కోటిలింగాలపేట శ్రీపందిరి మహాదేవుడు సత్రంలోని కృష్ణ యజుర్వేద స్మార్త పాఠశాలలో ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని సత్రం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వీవీ పళ్లంరాజు తెలిపారు. 40 మంది స్మార్త విద్యార్థులకు యోగా గురువు పతంజలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ తరగతులు జరుగుతున్నాయన్నారు. ప్రతి విద్యార్థి బాల్య దశ నుంచి యోగాలో శిక్షణ పొంది మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంచుకోవాలని అన్నారు. ఈ శిక్షణ ఆరేళ్ల స్మార్త కోర్సు పూర్తయ్యే వరకూ ఉంటుందన్నారు. యోగా గురువు పతంజలి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటి వరకూ 350 యోగా శిబిరాలు నిర్వహించామన్నారు. సనాతన ధర్మానికి వారధిగా నిలిచిన ఈ స్మార్త పాఠశాలలో శిక్షణ ఇవ్వడం ఓ అపూర్వ ఘట్టమన్నారు.

శిక్షణ నిరంతర ప్రక్రియ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సహకార వ్యవస్థలో శిక్షణ నిరంతర ప్రక్రియ అని జిల్లా సహకార అధికారి ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక గాంధీపురంలోని రామదాసు సహకార శిక్షణ కేంద్రంలో శనివారం అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా సహకార హైట్ అధికారి జగన్నాథరెడ్డి, డీఎస్‌పీవో ఉమాపార్వతి, శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం



అన్నవితరణలో చిన్నవెంకన్నబాబు స్వామీజీ

సీటీఆర్‌ఐ: గాడాలలోని శ్రీమహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వరస్వామివారి పీఠాధిపతి, గురుగోవింద శ్రీమాన్ చిన్న వెంకన్నబాబు స్వామీజీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శనివారం నగరంలో నిరాశ్రయులకు అన్నవితరణ చేశారు. సుమారు వెయ్యి మందికి స్వామీజీ శిష్య బృందం అన్నవితరణ చేసింది. శ్రీమాన్ చిన్నవెంకన్నబాబు మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపమన్నారు. ట్రస్టు జాతీయ చైర్మన్ దుర్గా వెంకట హేమవతి మాట్లాడుతూ మనగుడి– మనసేవ జాతీయ ఆధ్యాత్మిక సేవా సమితి, సర్వేజనా సుఖినోభవంతు చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో సేవ చేశామన్నారు. ట్రస్టు ఉభయ తెలుగు రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్ పుట్టినరోజు కూడా కావడంతో వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని కొనసాగించారు. శనివరపు ధనరాజ్, సూరిశెట్టి వీరవెంకట సత్యనారాయణమూర్తి, పచ్చిపులుసుల వీరభద్రరావు, ట్రస్ట్ రాష్ట్ర చైర్మన్ అంబటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మీ సేవలు బంగారంగానూ...

- ఆర్బీకేలతో వ్యవసాయ విప్లవం
- టీడీపీ హయాంలో కన్నీళ్ల సాగు
- వైఎస్సార్ సీపీతో సంక్షేమ పరవళ్లు

ఒకప్పుడు అన్నదాతకు సాగులో కష్టాలు.. కన్నీళ్లే. దినదిన గండమే.. టీడీపీ అధినేత చంద్రబాబు సాగును దండగ అనడమే కాకుండా అలా మార్చారు కూడా... అలాంటి సమయంలో అధికారంలోకి వచ్చిన జగనన్న ప్రభుత్వం సాగులో సిరులు కురిపించింది.. వ్యవసాయం రంగాన్ని పుంతలు తొక్కించింది.. తద్వారా సాగు బంగారమైంది.. ఆర్బీకేల ఏర్పాటుతో పాటు వైఎస్సార్ యంత్ర సాయం, సాగు రుణాలు, రైతుల భరోసా వంటి పథకాలు కొండంత ఆసరాగా నిలిచాయి.. నేడు ముంగిటకే వచ్చిన రైతు భరోసా కేంద్రాలతో అన్ని సేవలూ అందుతున్నాయి.

కడియం: అన్నదాతలకు అడుగడుగునా అండగా నిలుస్తూ సీఎం జగన్ నేనున్నాననే భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టినప్పటి నుంచి నాలుగేళ్లుగా రైతు సంక్షేమానికి బాటలు వేస్తుంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా సాగుకు అవసరమైన అన్ని సదుపాయాలను రైతుల వద్దకే అందిస్తోంది. సాగులో ఎదురయ్యే ఇబ్బందులను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తోంది. ఇందులో భాగంగా కడియం మండలంలో మొత్తం 27 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల తరఫున తగినంత సిబ్బందిని నియమించారు. వీరు నేరుగా రైతుల వద్దకే వెళ్లి సాగులో మెలకువలపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన అన్ని సేవలను అందిస్తున్నారు. కడియం మండలం పరిధిలో 10,473.88 ఎకరాల సాగు భూమి ఉంది. ఇందులో 6,567 మంది రైతులు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. వరితో పాటు కూరగాయలు తదితర ఉద్యాన పంటల సాగు విస్తృతంగా జరుగుతోంది.

ఆ ఇబ్బందులు తప్పాయి

గతంలో రైతులకు ఏదైనా సమస్య ఎదురైతే మండల కేంద్రమైన కడియంలో ఉండే అధికారుల వద్దకు వెళ్లాల్సి వచ్చేది. లేకపోతే అధికారులు గ్రామాలకు వచ్చేంత వరకూ వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంబంధిత సిబ్బంది గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లోనే అందుబాటులో ఉంటున్నారు. అక్కడి నుంచే రైతులకు అవసరమైన అన్ని సేవలను అందిస్తున్నారు. దీంతో రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన ఇబ్బందులు ఇప్పుడు తప్పాయి.



జేగురుపాడులో రైతు భరోసా కేంద్ర భవనం



కడియం ఆర్బీకే వద్ద రాయితీపై ఎరువుల పంపిణీ

అందుతున్న సేవలు ఇలా..

ఆర్బీకేల్లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుతున్నారు. మట్టి నమూనాల సేకరణ, ఈ– క్రాప్ బుకింగ్, ధాన్యం కొనుగోళ్ల సేవలతో పాటు పొలంబడి కార్యక్రమం ద్వారా సాగు లో మెలకువలు వివరిస్తున్నారు. ఖరీఫ్‌లో 457 మంది రైతులకు 1,164.85 ఎకరాలకు ఇన్సూరెన్స్ క్లెయిమ్ రూ.61,95,722, అరటి రైతులు 149 మందికి పంటల బీమా క్లెయిమ్‌లు రూ.8,59,234 ఇచ్చారు. 8,500 చదరపు అడుగుల్లో రూ.64 లక్షల విలువైన పాలీహౌస్‌లు అందజేశారు. రూ.5 లక్షల విలువైన డ్రిప్ ఇరిగేషన్‌ను ఏర్పాటు చేశారు. ఇన్‌పుట్ రాయితీ కింద 294 మంది ఉద్యాన రైతులకు రూ.9 లక్షలు, రైతు భరోసా పథకం ద్వారా 5,128 మందికి రూ.282 లక్షలు పంపిణీ చేశారు.

ఎంతో తోడ్పాటు



రైతులకు సాగులో ఎదురయ్యే వివిధ రకాల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు రైతు భరోసా కేంద్రాలు ఎంతో తోడ్పడుతున్నాయి. తమ గ్రామంలోనే ఏర్పాటైన ఆర్బీకేల వద్దకు వెళ్లి అక్కడి సిబ్బంది తమ సమస్యను చెప్పుకోవడం ద్వారా సదరు సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో మండల కేంద్రంలో ఉండే అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడా సమస్య లేదు.

–బొమ్మిరెడ్డి వెంకటరావు, కడియం

పంటలకు మద్దతు ధర



గతంలో దళారులు చెప్పిన ధరకు ధాన్యం అమ్ముకోవాల్సి వచ్చేది. అయితే మద్దతు ధరను ప్రకటించడంతో పాటు, ఆ ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుండడంతో ఇప్పుడు రైతులకు మేలు జరుగుతోంది. కొనుగోళ్ల విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులు స్పందించి పరిష్కరిస్తున్నారు. ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేపట్టడంతో అదనపు ప్రయోజనం కలుగుతోంది.

–బీవీవీ సత్యనారాయణ, కడియం

వైఎస్సార్ సీపీ అభిమానికి అభినందన



బైక్ యాత్ర చేపట్టిన అడవికొట్టురాజును అభినందిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: వచ్చే 2024 సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావాలని కోరుతూ బైక్ యాత్ర చేపట్టిన వైఎస్సార్ సీపీ వీరఅభిమాని, పాస్టర్ అడవికొట్టురాజు శనివారం వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అడవికొట్టురాజు మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా జలదంకి మండలం అన్నవరం తన స్వగ్రామమన్నారు. సీఎం జగన్ నాలుగేళ్లలో చేపట్టిన సంక్షేమ పథకాలను రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రచారం చేసేందుకు బైక్ యాత్ర చేపట్టానన్నారు. తిరిగి జగన్ ముఖ్యమంత్రి కావాలనే లక్ష్యంతో ఇప్పటి వరకూ 110 నియోజకవర్గాల్లో పర్యటించానని, ఇంకా 65 నియోజకవర్గాల్లో పర్యటించాల్సి ఉందన్నారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ అడవికొట్టురాజు బైక్‌యాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం అతనికి ఆర్థిక సహాయం అందించారు.

జేకే హోం డెకార్స్ ప్రారంభం



జేకే హోం డెకార్స్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

ప్రకాశంనగర్: అను ఇంటీరియర్స్ అండ్ ఫర్నిషింగ్ షోరూమ్ ద్వారా 19 ఏళ్లుగా ఖాతాదారులకు విశేష సేవలందిస్తున్న జేకే హోం డెకార్స్ షోరూమ్‌ను శనివారం స్థానిక వీఎల్‌పురం ఎల్‌ఐసీ కార్యాలయం న్యూ రోడ్డులో ప్రారంభించినట్లు నిర్వాహకుడు పి.కుమార్ తెలిపారు. దీనికి ఎంపీ, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్ మార్గాని భరత్‌రామ్ ముఖ్య అతిథిగా హాజరై షోరూమ్‌ను ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలన్నారు. రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శివరామ సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్, మాజీ మేయర్ ఆదిరెడ్డి రాఘవమ్మ పాల్గొన్నారు.

పేదలకు ఆహారం పంపిణీ

కడియం: వేమగిరికి చెందిన ఎలోహి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోడ్డు పక్కనున్న పేదలకు శనివారం ఆహారం పంపిణీ చేశారు. దీనికి ప్రభుత్వ వైద్యులు ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరై ప్రతి నెలా పేదలకు ఆహారం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. నిర్వాహకులు శ్రీకాంత్ కాశి, ఆనంద్‌పాల్, ఏజ్రా, పడాల బుజ్జి, కాగిత రాజు, జి.వీరబాబు, రాకేష్ పాల్గొన్నారు.

వైద్య వృత్తి దైవంతో సమానం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వైద్య వృత్తి దైవంతో సమానమని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ అన్నారు. స్థానిక జిల్లా ఆసుపత్రిలో శనివారం డాక్టర్స్ డేను పురస్కరించుకుని ఉత్తమ సేవలందించిన పలువురు వైద్యులను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ అమ్మ మనకు జన్మనిస్తే, ఆరోగ్య సమస్యల నుంచి కాపాడి వైద్యులు పునర్జన్మ ఇస్తారన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆర్.హేమంతి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సౌభాగ్యలక్ష్మి, ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ పిడుగు విజయభాస్కర్ మాట్లాడారు. ఐఎంఏ నగర అధ్యక్షుడు డాక్టర్ గురుప్రసాద్, వైద్యులు సురేంద్ర, జి.రవిరామ్‌కిరణ్, తరుణ్, శశాంక్ పాల్గొన్నారు.

- నగరంలో ప్రముఖ మానసిక వైద్యుడు కర్రి రామారెడ్డిని స్పందన ఈదా ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ జిల్లా శాఖ ప్రతినిధులు సత్కరించారు. ఫౌండేషన్ చైర్మన్ ఈదా శామ్యూల్ రెడ్డి తరఫున డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు కస్తూరి సతీష్‌బాబు, సలహాదారులు పరస జగన్నాథరావు పాల్గొన్నారు.

వైద్యులు ప్రత్యక్ష దైవాలు

రాజమహేంద్రవరం సిటీ: వైద్యులు ప్రత్యక్ష దైవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్‌ఆధ్వర్యంలో శ్రీత్యాగరాయ నారాయణదాస కల్యాణ మండపంలో డాక్టర్స్, ఆడిటర్స్ దినోత్సవాలను నిర్వహించారు. మానసిక వైద్య నిపుణుడు కర్రి రామారెడ్డి, వైద్య నిపుణులు ఆర్.భాస్కరచౌదరి, వల్లభనేని శరత్‌కుమార్, ఆర్‌ఎస్ చలం, పంతం అచ్యుతరామారావు, పి.సుజాత, తేతలి వెంకటేశ్వరరావు, జీఎస్ సాయిప్రసాద్, జి.వరప్రసాద్, చక్కా మార్కండేయులు, ఆనందరావు, ఆడిటర్ బోడ సూర్యనారాయణలను సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు తీగల రాజా, కోశాధికారి గ్రంధి రాజా తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ భాస్కరచౌదరిని సత్కరిస్తున్న ది పీఎంపీ అసోసియేషన్ సభ్యులు



డాక్టర్ కర్రి రామారెడ్డిని సత్కరిస్తున్న న్యాయమూర్తి ప్రత్యూషకుమారి

సేవలే స్ఫూర్తిగా సాగాలి

రాజమహేంద్రవరం రూరల్: డాక్టర్ బీసీ రాయ్ పేదలకు అందించిన సేవలను నేటి వైద్యులు స్ఫూర్తిగా తీసుకుని సాగాలని డెల్టా హాస్పిటల్ శస్త్ర చికిత్స నిపుణుడు రిమ్మలపూడి భాస్కరచౌదరి అన్నారు. శనివారం ది పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక హుకుంపేట గోదావరి రుచులు కాన్ఫరెన్స్ హాల్‌లో నగర శాఖ అధ్యక్షుడు రహమాన్ ఖాన్ అధ్యక్షతన జాతీయ వైద్యుల దినోత్సవం, వైద్య విజ్ఞాన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ భాస్కరచౌదరి మాట్లాడుతూ బీసీ రాయ్‌ను స్మరిస్తూ డాక్టర్స్ డే జరుపుకొంటున్నామని అన్నారు. అధునాతన శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ ఆర్.నితిన్ మాట్లాడుతూ నేడు శస్త్రచికిత్సా విధానంలో లేజర్ చికిత్స ఆవశ్యకతను వివరించారు. క్యాన్సర్ వైద్య నిపుణుడు సుమంత్, మెదడు, నరాల శస్త్రచికిత్స నిపుణులు గీత శ్రవణ్ మాట్లాడారు. అనంతరం వైద్యులను సత్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, జిల్లా కోకన్వీనర్ బళ్లా శ్రీనివాసరావు, మండల కార్యదర్శి మట్టా రమేష్, కోశాధికారి యు.ప్రసాద్‌బాబు, జిల్లా మాజీ సలహాదారు పి.దేవానందం, ఎ.సురేష్‌బాబు, సుంకర శ్రీనివాస్, కె.లక్ష్మీనారాయణ, డెల్టా హాస్పిటల్ మేనేజర్ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఆసుపత్రిలో వైద్యులను సన్మానిస్తున్న సూపరింటెండెంట్ రమేష్ తదితరులు

- స్థానిక టి.నగర్‌లోని భాష్యం స్కూల్‌లో వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. దీనికి కేఎస్‌ఆర్ హాస్పిటల్ డాక్టర్ కొమ్మా సునీత ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యవంతంగా ఎదగాలంటే మంచి పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. భాష్యం జోనల్ ఇన్‌చార్జి సత్యనారాయణ, ప్రిన్సిపాల్స్ సాధన, తులసీప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ శనివారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకూ ఇండస్ట్రియల్ ఏరియా, నేషనల్ హైవే, హార్లిక్స్ ఫ్యాక్టరీ, హనుమాన్ ఐస్ ఫ్యాక్టరీ, బాబా టైల్స్, కలెక్టరేట్ కార్యాలయ పరిధిలో ప్రభావం ఉంటుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఆల్‌బ్యాంకు కాలనీ, వీఎల్ పురం, సత్యనారాయణ పురం, పెద్దవీధి, శ్రీనగర్ కాలనీ, తిలక్ రోడ్, కోనేరుపేట, సాయి బృందావన్ కాలనీ, మోరంపూడి సెంటర్, ఎం మార్బల్ నేషనల్ హైవే ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

అధిక ఫీజులకు వ్యతిరేకంగా ఉద్యమం

సీటీఆర్‌ఐ: ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో అధికంగా ఫీజులు వసూలు చేయడంపై ఉద్యమిస్తానని జాతీయ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ఇన్‌చార్జి బోను దుర్గానరేష్ యాదవ్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుల కన్నా అధికంగా వసూలు చేస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలపై విద్యాశాఖ చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు బర్ల సీతారత్నం, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాయుడు రాకేష్, అంబేడ్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాడేపల్లి విజయకుమార్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సేవలు అందించడమే లక్ష్యం

రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: అర్హులందరికీ ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని మురమండ, దుళ్ల గ్రామాల్లో నిర్వహించిన జగన్న సురక్ష కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చందన మాట్లాడుతూ 15 వేలకు పైగా క్యాంపుల ద్వారా 1.6 కోట్ల గృహాలను సర్వే చేసి, ప్రజల అవసరాలను గుర్తించారన్నారు. మురమండ సచివాలయం–1 పరిధిలో 677 ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. దుళ్లలో 562 మందికి ఇచ్చారు. మండల ప్రత్యేకాధికారి వి.రాధాకృష్ణ, ఎంపీడీఓ రత్నకుమారి, తహసీల్దార్ సుజాత, జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, నాయకులు అయినవిల్లి వెంకటేశ్వరరావు, యర్రా సూర్యనారాయణ, సాపిరెడ్డి సూరిబాబు, శాక పట్టాభి, పెనుమాక సునీల్, తోకల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అందరికీ న్యాయం


రాజమహేంద్రవరం రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే ఏకైక లక్ష్యంతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. తొర్రేడులో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభోత్సవ సభలో ఆయన పాల్గొని విద్యార్థులకు ఉచితంగా వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. నాగేశ్వర్ మాట్లాడుతూ పేదలు అన్నివిధాలా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో సీఎం జగన్ అనేక పథకాలను పార్టీలు, కుల మతాలకు అతీతంగా అందజేస్తున్నారన్నారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొర్రేడులో వివిధ రకాల 441 సర్టిఫికెట్లు అందజేసినట్లు నియోజకవర్గ ప్రత్యేకాధికారి, టూరిజం డెవలప్‌మెంట్ ఆఫీసర్ స్వామినాయుడు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి కేఎన్ జ్యోతి, ఎంపీడీఓ డి.శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ రత్నసాగర్, మండల విద్యాశాఖాధికారి–2 చందుకుమార్ పాల్గొన్నారు. హుకుంపేట సభలో చందన నాగేశ్వర్ పాల్గొని వివిధ రకాల సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందించారు. జిల్లా గిరిజన సంక్షేమాధికారి కేఎన్ జ్యోతి, మండల ఇంజినీర్ సంపత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనీల్, మండల విద్యాశాఖాధికారి–1 తులసీదాస్, రాష్ట్ర ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ డైరెక్టర్ షకీలాబేగం, సొసైటీ చైర్మన్ బొప్పన సుబ్బారావు పాల్గొన్నారు. రాజవోలు సభలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్, మాజీ ఎంపీటీసీ నక్కా శ్యాంబాబు, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, సచివాలయ కన్వీనర్ల చేతుల మీదుగా సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందించారు. తహసీల్దార్ పైడి చిన్నారావు, ఈఓపీఆర్డీ టి.కృష్ణ, ఏఎస్‌వో రామం తదితరులు పాల్గొన్నారు.



దుళ్లలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు నేతాజీనగర్‌లో శనివారం రాత్రి వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ సమక్షంలో టీడీపీ, జనసేన నుంచి భారీగా వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామ సచివాలయం–4 కన్వీనర్ కేవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బృందావన్ కాలనీ, నేతాజీనగర్ వాసులకు చందన నాగేశ్వర్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పాటు, చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరామని వారు పేర్కొన్నారు. పార్టీలో చేరిన ప్రతిఒక్కరూ 2024లో సీఎం జగన్ తిరిగి ముఖ్యమంత్రి అయ్యేందుకు కృషి చేయాలని చందన పిలుపునిచ్చారు. బృందావన్ కాలనీ నుంచి మానస, గీత, రాణి, మమత, శేషమ్మ, సుబ్బలక్ష్మి పార్టీలో చేరారు. వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, జేసీఎస్ కన్వీనర్లు విష్ణుమూర్తి, రాజమౌళి, నాయకులు యెనుముల త్యాగరాజు, సద్గుణ రామారెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో చందన నాగేశ్వర్, పార్టీ నాయకులు

తొలిరోజునే ఆనందమనిపించేన్

- ఇంటికి వెళ్లి అందించిన వలంటీర్లు
- మొదటి రోజు 90 శాతం పూర్తి

సీటీఆర్‌ఐ: ఒకటో తేదీ వచ్చిందంటే పింఛనుదారులకు పండగే.. ఇంటికెళ్లి పింఛను సొమ్ము వలంటీర్లు అందిస్తుండడంతో వారి మోములో చిరునవ్వులు వెల్లివిరుస్తున్నాయి. అంతేకాకుండా లబ్ధిదారులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా.. వేరేచోట ఉన్నా పింఛన్ అందిస్తున్నారు. రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో మొత్తం 28,933 మంది పింఛనుదారులు ఉండగా, రూ.8 కోట్లకు పైగా ప్రభుత్వం అందిస్తుంది. నెల మొదటి రోజు శనివారం 90 శాతం పింఛన్లను పంపిణీ చేశారు. స్థానిక 42వ డివిజన్ 79 సచివాలయ పరిధిలో ఎం.సరోజిని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నడుము ఆపరేషన్ చేయించుకుని చికిత్స పొందుతుంది. సచివాలయ వలంటీర్ జె.సీతామహాలక్ష్మి ఆసుపత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ చేసింది. 29వ సచివాలయ పరిధిలో నివసిస్తున్న చల్లా సతీష్ హైదరాబాద్‌లో జట్టు కూలీగా పని చేస్తున్నాడు. గత నెల హైదరాబాద్ నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా ట్రైన్ నుంచి ఖాజీపేట వద్ద జారిపడ్డాడు. దీనితో అతని రెండు చేతులూ తొలగించారు. రాజమహేంద్రవరం అయ్యప్పనగర్‌లో ప్రస్తుతం దీనస్థితిలో ఉన్న అతనికి వైఎస్సార్ బీమా నమోదు కావడంతో రూ.2.50 లక్షలు ప్రభుత్వం నుంచి రానుంది. డివిజన్ సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ వెలగల వెంకట ప్రతాప్‌రెడ్డి అతని ఇంటి వద్దకు వెళ్లి బీమా క్లెయిమ్‌ను నమోదు చేయించారు. సదరన్ సర్టిఫికెట్ వస్తే అతనికి పింఛన్ కూడా అందించనున్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సరోజినికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సీతామహాలక్ష్మి

సంఘ సభ్యుల సంక్షేమానికి కృషి

ప్రకాశంనగర్: సువర్ణ వర్తక సంఘంలోని సభ్యుల సంక్షేమానికి కొత్త కార్యవర్గం కృషి చేస్తోందని సువర్ణ వర్తక సంఘం నగర అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి అన్నారు. సువర్ణ వర్తక సంఘం, సువర్ణ వర్తక సంఘ కల్యాణ మండపం కమిటీల ఎన్నిక స్థానికంగా జరిగింది. సువర్ణ వర్తక సంఘ అధ్యక్షుడిగా అడపా శ్రీహరి, గౌరవ కార్యదర్శిగా గంటా వీరవెంకటప్రకాష్, కోశాధికారిగా కృష్ణకుమార్ జవ్వార్, ఉపాధ్యక్షులుగా దినేష్‌కుమార్ జైన్, చంద్రమోహన్, సహాయ కార్యదర్శిగా లక్కోజి వీరభద్రరావు, కార్యవర్గ సభ్యులుగా కక్కిరాల బుచ్చిరాజు, ఎస్‌రాజగోపాల్, లచ్చిరెడ్డి శ్రీనివాస్ తదితరులు ఎన్నికయ్యారు. కల్యాణ మండపం కమిటీ అధ్యక్షుడిగా బొడ్డు రామారావు, కార్యదర్శిగా కొనగళ్ల వరదరాజు, ఉపాధ్యక్షులుగా పెదిరెడ్ల సత్యనారాయణ, కరణం జానకీరామ్, సంయుక్త కార్యదర్శిగా యువరాజ్, కోశాధికారిగా అల్లు చందు, కమిటీ సభ్యులుగా మామిడి వెంకటరాజు, మండా రాము, గొల్లపూడి రామలింగేశ్వరరావు, కాళ్లకూరి నారాయణమూర్తి తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీహరిని ఉభయ కమిటీలు సత్కరించాయి. సంఘం గౌరవ అధ్యక్షుడు కూర్మదాసు ప్రభాకర్, చాంబర్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు, సంఘ నాయకులు కాంతారామ్ పాటిల్, వెత్సా బాబ్జి, కొత్త బాలమురళీ, కొత్త విజయరాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు శ్రీహరిని సత్కరిస్తున్న సువర్ణ వర్తక సంఘం సభ్యులు

ఇంట్లోకి చొరబడి చోరీ

కడియం: కడియపులంక పంచాయతీ పరిధి దోసాలమ్మ కాలనీలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... దోసాలమ్మ కాలనీకి చెందిన బి.చంద్రావతి తన ఇంట్లోని బెడ్‌రూమ్‌లో, భర్త ఏసురాజు, కుమారుడు హాల్‌లో నిద్రించారు. ఇంటి తలుపులకు తాళం వెయ్యలేదు. తెల్లవారు జామున 2.30 గంటల ప్రాంతంలో ఏసురాజు కాలిని ఎవరో తన్నుకుంటూ బయటకు వెళుతున్నట్లు అనిపించింది. మెలకువ వచ్చి చూడగా గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. అతడిని వెంబడిస్తూ వెళ్లినప్పటికీ అగంతకుడి ఆచూకీ దొరకలేదు. ఇంట్లోకి వచ్చి పరిశీలించగా బీరువాలోని 10 గ్రాముల బంగారు నెక్లెస్ మాయమైనట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కడియం హెడ్ కానిస్టేబుల్ సీహెచ్‌వీ రమణ కేసు నమోదు చేశారు.